సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



చిరుతల సంచారం

మోపాల్ మండలం కులాస్‌పూర్ అడవుల్లో చిరుతలు సంచరిస్తున్నట్లు గ్రామస్తులు అటవీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

- 8లో ▸



పండుగలు సంస్కృతికి ప్రతీకలు

ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జడకొప్పు కోలాటం నిర్వహించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.8 /23.0

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పనితీరులో మార్పు కనిపించాలి



మోపాల్ : వైద్యారోగ్య శాఖ పనితీరులో మార్పు కనిపించాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులకు ఆదేశించారు. మోపాల్ మండలంలోని ముదక్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీయగా, పలువురు అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని డీఎంహెచ్‌వో రాజశ్రీని ఆదేశించారు. పీహెచ్‌సీల పనితీరు గాడిలో పెట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

బహిరంగంగా మద్యం తాగితే కేసులు

ఖలీల్‌వాడి : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని సీపీ కల్మేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. బహిరంగ మద్యపానంతో మహిళలు, పిల్లలు ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 30 ఉదయం 6 గంటల వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.

ఖర్గేను కలిసిన మహేశ్ గౌడ్



ఖలీల్‌వాడి : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా నియమితులైన ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ గురువారం కుటుంబ సమేతంగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఖర్గేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 15న టీపీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపడుతున్న దృష్ట్యా గాంధీ భవన్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ఐసీడీఎస్‌లో బదిలీలకు కౌన్సెలింగ్

నిజామాబాద్ నాగారం : ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ టీచర్ల బదిలీలకు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న అంగన్‌వాడీ టీచర్లకు గురువారం కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ పీడీ షేక్ రసూల్‌బీ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. సీనియార్టీ ప్రాతిపదికన సుమారు 45మందికి కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేశారు.



ఇంజినీరింగ్ కాలేజీగా అప్‌గ్రేడ్ కానున్న పాలిటెక్నిక్ కళాశాల

ఇందూర్‌కు ఇంజినీరింగ్ కాలేజీ

- పాలిటెక్నిక్ కళాశాలను ఉన్నతీకరిస్తూ మంత్రివర్గ ఉపసంఘం తీర్మానం
- నెరవేరనున్న ఏళ్ల కల
- ఉమ్మడి జిల్లా విద్యార్థులకు మేలు
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా వాసులు

జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు కానుంది. ఎన్నో ఏళ్లుగా జిల్లావాసులు చేస్తున్న డిమాండ్‌కు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. ఇప్పటికే జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ, తెలంగాణ యూనివర్సిటీ ఉండగా ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల కావాలని ప్రజలు కోరుతున్నారు. ఈ క్రమంలో ఇందూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీని ఇంజినీరింగ్ కాలేజీగా ఉన్నతీకరించాలని మంత్రివర్గ ఉపసంఘం తీర్మానం చేసింది.

నిజామాబాద్ అర్బన్ : జిల్లావాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరనుంది. స్థానికంగా ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ లేక దూర ప్రాంతాలకు వెళ్తున్న విద్యార్థుల బాధలు తీరనున్నాయి. జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటుకు మంత్రివర్గ ఉపసంఘం తీర్మానించింది. నిజామాబాద్ పాలిటెక్నిక్ కాలేజీని ఇంజినీరింగ్ కళాశాలగా ఉన్నతీకరించాలని నిర్ణయించింది. విద్యారంగంలో సంస్కరణల కోసం మంత్రి శ్రీధర్‌బాబు చైర్మన్‌గా ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘం బుధవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది పాలిటెక్నిక్ కళాశాలలను ఉన్నతీకరించాలని నిర్ణయించగా అందులో నిజామాబాద్ కూడా ఉంది. దీంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల అందుబాటులో లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు. పక్కన జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు కాగా నిజామాబాద్‌లో మాత్రం లేదు. దీంతో ఇటీవల పలు విద్యార్థి సంఘాల నాయకులు నిరసనలు కూడా తెలిపారు. ఈ క్రమంలో మంత్రివర్గ ఉప సంఘం ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు అంగీకరించింది.

ఎంతో చరిత్ర

జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో 1959లో 32 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేశారు. క్రమేపి ఆ స్థలంలో నుంచి ఇతర శాఖలకు కొంత కేటాయించడంతో ప్రస్తుతం 17.5 ఎకరాలలో పాలిటెక్నిక్ కళాశాల కొనసాగుతోంది. ఈ కాలేజీలో సివిల్, ఎలక్ట్రిక్, మెకానికల్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్స్, కంప్యూటర్ సైన్స్, ఎంబిడెడ్ సిస్టం కోర్సులు ఉన్నాయి. 1,583 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 70 మంది అధ్యాపకులతో పాటు 25 మంది బోధనేతర సిబ్బంది పని చేస్తున్నారు.

ఈ కాలేజీలో చదివిన ఎంతో మంది విద్యార్థులు వ్యాపారవేత్తలుగా, ఇంజినీర్లుగా స్థిరపడ్డారు. 2019 సంవత్సరంలో పాలిటెక్నిక్ కళాశాల డైమండ్ జూబ్లీ వేడుకలను కూడా ఘనంగా నిర్వహించారు. ఇక్కడ ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, కరీంనగర్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సైతం చదువుకుంటున్నారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ కాలేజీని ఇంజినీరింగ్ కళాశాలగా ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థల నాయకులు పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించారు. ఎట్టకేలకు మంత్రివర్గ ఉప సంఘం ఇంజినీరింగ్ కళాశాలగా ఏర్పాటు చేస్తూ తీర్మానం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరగా ప్రారంభించాలి

స్థానికంగా ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ ఉంటే జిల్లా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. ఇన్ని రోజులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకున్నారు. కాలేజీ ప్రారంభం అయితే ఇక్కడే చదువుకోవచ్చు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గం పరిధిలోని కోస్గిలో ఇటీవల ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఇదే మాదిరిగా నిజామాబాద్‌లో కళాశాల ఏర్పాటు అయితే మొదట డిమాండ్ ఉన్న పలు కోర్సులను ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. అయితే కాలేజీ ఎప్పుడు ఏర్పాటు చేస్తారనే విషయమై స్పష్టత రావాల్సి ఉంది. త్వరగా ప్రారంభించి అడ్మిషన్లు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

అందుబాటులో వసతులు



జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే జిల్లా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. పాలిటెక్నిక్ కళాశాలలో అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయి. ఇంజినీరింగ్ విద్య అందుబాటులోకి వస్తే మరింత మేలు జరుగుతుంది. **– నరేశ్, పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్**

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలగా ఏర్పాటు చేయాలని నిర్ణయించడం హర్షణీయం. గతంలో మేము కూడా ఈ విషయంలో ప్రభుత్వానికి విన్నవించాం. ప్రస్తుతం మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయం తీసుకోవడం జిల్లాకు ఎంతో మేలు. త్వరగా ఏర్పాటు చేసి అడ్మిషన్లు ప్రారంభిస్తే బాగుంటుంది. **– తోట రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి, పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం**

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- ఇంటి నిర్మాణం ఆన్‌లైన్‌లో నమోదు కోసం లంచం డిమాండ్
- రూ.8 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



నందిపేట జీపీ కార్యాలయంలో విచారణ చేస్తున్న ఏసీబీ అధికారులు



ఏసీబీకి చిక్కిన కార్యదర్శి నవీన్‌కుమార్

నందిపేట్ : నందిపేట పంచాయతీ కార్యదర్శి ఇసపల్లి నవీన్‌కుమార్ ఏసీబీకి చిక్కాడు. రూ.8వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. నిజామాబాద్ ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ వివరాలను వెల్లడించారు. నందిపేట మండలం కంఠం గ్రామానికి చెందిన సుభాష్ నందిపేటలోని రాజనగర్ ప్రాంతంలో ఇల్లు కట్టుకున్నాడు. అయితే తన పేరు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో పంచాయతీ కార్యదర్శి నవీన్‌కుమార్‌ను సంప్రదించగా రూ.10 వేలు లంచం ఇస్తేనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తానని అన్నాడు. చివరకు రూ.8 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో సుభాష్ వారం రోజుల క్రితం ఏసీబీ అధికారులను సంప్రదించాడు. వారి సూచనల మేరకు గురువారం పంచాయతీ ఆఫీసులో రూ.8 వేలు లంచం తీసుకుంటుండగా నవీన్‌కుమార్‌ను పట్టుకున్నామని డీఎస్పీ తెలిపారు. నవీన్‌కుమార్‌ను శుక్రవారం ఏసీబీ ప్రత్యేక కోర్టులో ప్రవేశపెడతామని పేర్కొన్నారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, వేణు నాగేష్ ఉన్నారు.

సమీపిస్తున్న గడువు!

- షరతులు లేకుండా రుణమాఫీ, రైతుబంధుపై స్పష్టతనివ్వని ప్రభుత్వం
- ఈ నెల 15 వరకు గడువు ప్రకటించిన రైతు జేఏసీ నాయకులు
- సమస్య పరిష్కరించకపోతే అసెంబ్లీ ముట్టడిస్తామని అల్టిమేటం



ఆర్మూర్‌లో ధర్నా నిర్వహిస్తున్న రైతులు (ఫైల్)

ఆర్మూర్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతీ రైతుకు షరతులు లేకుండా రూ.2 లక్షల రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు ఇచ్చిన గడువు మరో రెండు రోజుల్లో ముగియనుంది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈ నెల 15 వరకు వేచి చూసి జిల్లా రైతాంగాన్ని ఏకం చేసి అసెంబ్లీ ముట్టడికి ప్రణాళిక రూపొందించడానికి రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మొదట ఈ నెల 16న జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నారు. కుటుంబం ప్రాతిపదికన కాకుండా ప్రతీ రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా ఇవ్వాలని, వరి పంటకు రూ.500 బోనస్ ఇవ్వాలనే డిమాండ్ల సాధన కోసం రైతులు రోడ్డెక్కారు. ఆర్మూర్ కేంద్రంగా వేల సంఖ్యలో రైతులు గత నెల 24న ధర్నా నిర్వహించిన విషయం విదితమే. ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలకు చెందిన రైతులు ధర్నాలో పాల్గొనగా బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. తమ డిమాండ్లను తెలియజేస్తూ ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సెప్టెంబర్ 15లోగా ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాని పక్షంలో అసెంబ్లీ ముట్టడి చేస్తామని నిరసన వేదికపై రైతు నాయకులు అల్టిమేటం జారీ చేశారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణకు రూపకల్పన చేస్తున్నారు.

ఆందోళనలో గల్ఫ్ కార్మికుల కుటుంబీకులు

రేషన్ కార్డు లేని రైతుల కుటుంబాలను నిర్ధారించుకోవడానికి వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అయితే భూమి ఎవరి పేరున ఉందో ఆ రైతులు ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లడం, భార్యాభర్తల్లో ఒకరు చనిపోతే పట్టా మార్పిడి చేసుకోకుండా బ్యాంకులో రుణం అలాగే ఉండటం సమస్యలు ఎదురవుతున్నాయి. భర్త చనిపోయిన పక్షంలో భార్య పేరుతో కుటుంబాన్ని నిర్ధారించే వెసులుబాటు యాప్‌లో లేదు. దీంతో తమకు రుణ మాఫీ కాదేమోననే రైతులు ఆందోళనను చెందుతున్నారు. రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులకు తమ గోడు వెల్లబోసుకుంటున్నారు.

ప్రభుత్వం దిగి రాకపోతే ఉద్యమం



మాట్లాడుతున్న రైతు జేఏసీ నాయకులు

పెర్కిట్(ఆర్మూర్) : రుణమాఫీపై ప్రభుత్వం దిగి రాకపోతే ఉద్యమం తప్పదని రైతు ఐక్య కార్యారణ కమిటీ సభ్యులు హెచ్చరించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఎమ్మార్ గార్డెన్‌లో గురువారం రైతు జేఏసీ నాయకులు ఇట్టెడి లింగారెడ్డి, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, దేగాం యాదాగౌడ్, దేవారాం, సుక్కి సుధాకర్, తిరుపతిరెడ్డి, అల్లూరి గంగారెడ్డి సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా అందివ్వాలని గత నెల 24న రైతు జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ప్రభుత్వానికి సెప్టెంబరు 15 వరకు గడువు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదన్నారు. కుటుంబ నిర్ధారణ సర్వేలో సైతం జాప్యం జరుగుతుందన్నారు. బతుకుదెరువు కోసం విదేశాలకు వెళ్లిన వారు, సైన్యంలో పని చేస్తున్న వారు, భార్య చనిపోతే భర్త, భర్త చనిపోతే భార్య ఉన్న కుటుంబాల నిర్ధారణను చేయడానికి యాప్‌లో అవకాశం లేదన్నారు. అటువంటి వారికి రుణమాఫీ ఎలా చేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ నెల 16న తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

స్తంభించిన ‘మీ సేవలు’

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- రాష్ట్రవ్యాప్తంగా సర్వర్ సమస్య అంటున్న అధికారులు

ఇందల్వాయి : రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులుగా మీ సేవ కేంద్రాల్లో సేవలు స్తంభించిపోయాయి. దీంతో వివిధ రకాల ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా పత్రాలు అవసరం ఉన్న వారు కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. మీ– సేవా కేంద్రాల్లో సేవలు నిలిచిపోవడం సాధారణమే అయినా మూడు రోజుల పాటు నిలిచి పోవడం ఇదే మొదటిసారి. ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే శని, ఆది వారాల్లో సెలవు దినాల్లో సమస్యలను సరిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసేవారు. ప్రస్తుతం సేవలు అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై జిల్లా ఈ–మేనేజర్ కార్తీక్‌ను వివరణ కోరగా రాష్ట్రవ్యాప్తంగా సర్వీసులు నిలిచిపోయాయని తెలిపారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఐటీ రంగ నిపుణులు కృషి చేస్తున్నారని చెప్పారు. శుక్రవారంలోగా సేవలు తిరిగి ప్రారంభం అవుతాయని తెలిపారు.

మూడు రోజులుగా తిరుగుతున్నా..



ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడానికి ఇన్‌కమ్ సర్టిఫికెట్ అవసరముంది. దాని కోసం దరఖాస్తు చేద్దామని మూడు రోజులుగా మీ–సేవ కేంద్రం చుట్టూ తిరుగుతున్నాను. ఏవో సమస్యలు ఉన్నాయని, దరఖాస్తులు అప్‌లోడ్ కావట్లేదని కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు. **– పిన్నెం తిర్మల్, నల్లవెల్లి**

డివైడర్‌ను ఢీకొన్న అంబులెన్స్

- హైవే అంబులెన్స్‌లో వెంటిలేటర్ కరువు
- ఆక్సిజన్ అందక బాలుడి మృతి



సాత్విక్ మాణే

నిజాంసాగర్: సకాలంలో ఆస్పత్రులకు చేర్చి ప్రాణాలు నిలిపే అంబులెన్సే ఆ బాలుడి మరణానికి కారణమయ్యింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి డివైడర్‌ను ఢీకొట్టడం, హైవే అంబులెన్స్‌లో వెంటిలేటర్ సదుపాయం లేకపోవడంతో ఆక్సిజన్ అందక బాలుడు మృత్యువాతపడ్డాడు. వివరాలు.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా దేగావ్ గ్రామానికి చెందిన సుజాత మాణే, ఉమాకాంత్ మాణే దంపతుల కుమారుడు సాత్విక్ మాణే (5) న్యూమోనియాతో బాధపడుతుండడంతో హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రిలో చేర్పించారు. పొలం అమ్మి రూ.11 లక్షలు ఖర్చు చేశారు. అయినా ఆరోగ్యం మెరుగవకపోవడం, వైద్యం చేయించడానికి డబ్బులు లేకపోవడంతో బాలుడిని నాందేడ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. వెంటిలేటర్ ఉన్న అంబులెన్స్‌లో బాలుడిని తీసుకుని బుధవారం రాత్రి నాందేడ్ బయలుదేరారు. అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతో నర్సింగ్‌రావుపల్లి చౌరస్తా సమీపంలో గురువారం తెల్లవారుజామున డివైడర్‌ను ఢీకొంది. హైవే అంబులెన్స్‌లు ఘటనా స్థలానికి వచ్చినా.. వెంటిలేటర్ సదుపాయం లేకపోవడంతో బాలుడిని తరలించలేకపోయారు. దీంతో ప్రమాద స్థలిలో మూడు గంటలపాటు అంబులెన్స్‌లో ఉన్న బాలుడు.. చివరికి ఆక్సిజన్ అందక ప్రాణాలు విడిచాడు.

ఎండాకు, అగ్గి తెగుళ్లపై ఆందోళన వద్దు



- అధిక వర్షాల వల్లే వరికి తెగుళ్లు
- పైపాటుగా ఎరువులు వేస్తే పంట కోలుకుంటుంది
- ‘సాక్షి’ ఫోన్‌ఇన్‌లో రైతులతో జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్

డొంకేశ్వర్(ఆర్మూర్) : అధిక వర్షాల వలన వరిని అగ్గి తెగులు, ఎండాకు తెగులు, కాండం తొలిచే పురుగు ఆశించిందని దీనిపై రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ స్పష్టం చేశారు. పంట పసుపు రంగులోకి మారడం, కొనల నుంచి తెల్లటి చారలు ఉంటే పైపాటుగా ఎరువులను చల్లితే తిరిగి యథాస్థితికి చేరుకుంటుందన్నారు. వరుస వర్షాలు, వరదల కారణంగా తెగుళ్ల బారిన పడిన ఉద్యాన, వ్యవసాయ పంటలను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై గురువారం ‘సాక్షి’ నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. డీఏవో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

ప్రశ్న : పొలానికి ఎండు తెగులు సోకింది, ఏం చెయ్యాలి? **– గోపు ముత్యం, బజార్ కొత్తూర్, నందిపేట్ మండలం, నోముల రాజు, నల్లవెల్లి, ఇందల్వాయి మండలం**

డీఏవో: పొలమంతా వ్యాపించకుండా నివారణ చర్యలు చేపట్టాలి. ముందుగా పొలంలో కొంతమేర నీటిని తొలగించాలి. తీవ్రత ఎక్కువగా ఉంటే కాపర్‌హైడ్రాక్సైడ్ 400 గ్రాములు, స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 60 గ్రాములు ఒక ఎకరానికి పిచికారి చేయాలి. లేదా యూరియా పోటాష్‌లను మోతాదులో కలుపుకొని పైపాటుగా చల్లితే సరిపోతుంది. పంట కోతదశలో ఉంటే ఎలాంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం లేదు.

■ నల్ల పురుగు ఆశించింది **– సాయారెడ్డి, మెండోరా**

✤ వరికి ఆశించిన నల్ల పురుగును కంకినల్లి అంటారు. ఈ పురుగు రసం పీల్చడం వలన రంగుమారి ఆకుల, గింజలపై మచ్చలు ఏర్పడుతాయి.

■ వరి కొనలు రంగుమారుతున్నాయి
– రమేశ్, మద్దెపల్లి, నవీపేట్ మండలం
– ప్రవీణ్ రెడ్డి, బాడ్సి, మోపాల్ మండలం

✤ పంట పసుపు, తెలుపు రంగుల్లోకి మారితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. 20 కిలోల యూరియా, 10 కిలోల పోటాష్ కలుపుకొని పొలానికి చల్లాలి. స్థానిక వ్యవసాయాధికారులను సంప్రదిస్తే మేలైన మందులను సూచిస్తారు. వర్షాలు తగ్గుముఖం పట్టాయి కనుక పంట త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది.

నివారణకు డైకోఫాల్ 5మిల్లీ లీటర్లు లేదా స్పైరోమెసిఫెన్ 1మిల్లీ లీటరు రెండు సార్లు పదిహేను రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

■ అగ్గి తెలుగు సోకింది **– అట్టోలి సాయన్న, అన్నారం, డొంకేశ్వర్ మండలం, రొద్ద మురళి, మాయాపూర్, నందిపేట్ మండలం**

✤ తెగులు సోకిన మొక్కల ఆకులు ఎండిపోయి దూరం నుంచి చూసినట్లయితే పంట తగలబడినట్లు కనిపిస్తుంది. రంగుమారి మచ్చలు కూడా ఏర్పడుతాయి. కంకులకు పోషకాలు అందకపోవడం వలన మెడలు విరిగి వేలాడి గింజలు తొలగిపోతాయి. దీని నివారణ ట్రైసైక్లజోల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రోథయోలేన్ 1.5 మిల్లి లీటర్లు లేదా కాసుగామైసిన్ 2.5 మిల్లి లీటర్లు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

■ మొగిపురుగు వచ్చింది **– చల్ల భూమేశ్, జీజీ నడ్కుడ, డొంకేశ్వర్ మండలం**

✤ అంకురం నుంచి చిరుపొట్ట దశలో ఆశిస్తే ఈనిన తర్వాత తెల్లకంకులు బయటకు వస్తాయి. అంకురం నుంచి చిరుపొట్ట దశలో తప్పనిసరిగా ఎకరానికి కార్టఫ్ హైడ్రో క్లోరైడ్ 4జీ గుళికలు 8కిలోలు లేదంటే క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జీ గుళికలు 4కిలోలు లేదా కార్టాఫ్‌హైడ్రోక్లోరైడ్ 50ఎంపీ రెండు గ్రాములు లేదా క్లోరాంట్రానిప్రోల్ 18.5యస్‌సీ 0.3 మిల్లీ లీటరు చొప్పున నీటిలో కలిపి పిచికారి చేయాలి.



ఎండాకు తెగులు సోకిన వరి పంట

■ మొక్కజొన్న కోలుకోవడానికి ఏం చేయాలి **– కొట్టే చిన్న భూమన్న, దత్తాపూర్, డొంకేశ్వర్, సుంకరి రాజు, దత్తాపూర్, డొంకేశ్వర్**

✤ అధిక వర్షాల వలన మొక్కజొన్న నీటిని పీల్చుకుని పంట ఎదుగుదల లోపిస్తుంది. పంట కోలుకోవడానికి ఎకరానికి 20 కిలోల మ్యూరెట్ ఆఫ్ పోటాష్ వేయాలి. తెగుళ్ల ఆశిస్తే స్థానికంగా వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలి.

■ పసుపు పంటకు దుంపకుళ్లు వచ్చింది **– శ్రీనివాస్‌రెడ్డి, మైలారం, ధర్పల్లి మండలం, ప్రవీణ్‌రెడ్డి, నల్లవెల్లి, ఇందల్వాయి మండలం**

హార్టికల్చర్ డీడీ: వేరుకు దుంపకుళ్లు వస్తే పసుపు మొక్క పెరగదు. పురుగు లాంటి లక్షణాలు కనిపిస్తే 3జీ కార్బోఫిరాన్ వేప పిండిలో కలిపి ఎకరానికి ఐదారు కిలోలు చల్లుకోవాలి. పోటాష్ కూడా వేర్ల వద్ద పోయాలి. ఆకుమచ్చ తెగులు వస్తే పోడికోనాజోన్ అర లీటరు ఎకరానికి పిచికారి చేయాలి.

క్లుప్తంగా

ఇదేనా ఇందిరమ్మ రాజ్యం..?



నిజామాబాద్‌నాగారం: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపైకి గుండాలను పంపించి దాడి చేయించడమే ఇందిరమ్మ రాజ్యమా? అని జిల్లా పరిషత్‌ మాజీ చైర్మన్‌ విఠల్‌రావు ప్రశ్నించారు. నగరంలోని బీఆర్‌ఎస్‌ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూకట్‌పల్లి నుంచి గుండాలు, రౌడీషీటర్లతో కలిసి 20 కార్లలో అరికెపూడి గాంధీ మిట్టమధ్యాహ్నం కౌశిక్‌రెడ్డిపై హత్యాయత్నం చేస్తే పోలీసులు ఏం చేస్తున్నారన్నారు. కౌశిక్‌ ఇంటిపై దాడిని ఖండిస్తున్నామని, నిందితులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. నుడా మాజీ చైర్మన్‌ ప్రభాకర్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడు తెలంగాణ శంకర్‌, రాష్ట్ర యువజన నాయకుడు దాదన్న గారి సందీప్‌రావు, ఎనగందుల మురళి, కాశీచరణ్‌ పాల్గొన్నారు.

తగ్గుతూ పెరుగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుతూ పెరుగుతోంది. బుధవారం మధ్యాహ్నానికి తగ్గిన వరద నీరు మళ్లీ సాయంత్రానికి పెరగగా, 5 వరద గేట్ల ద్వారా 15 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. గురువారం మధ్యాహ్నానికి ఇన్‌ఫ్లో 34,605 క్యూసెక్కులకు తగ్గడంతో 2 వరద గేట్ల ద్వారా 6 వేల క్యూసెక్కులకు నీటి విడుదలను తగ్గించారు. వరద కాలువ ద్వారా 19 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 6 వేలు, సరస్వతి కాలువ ద్వారా 400, లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 684 క్యూసెక్కుల నీరు పోతుండగా, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 2 వేల క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరుపోతోంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి అదే స్థాయి నీటి మట్టంతో నిండుకుండలా ఉంది.

వస్తువు కొంటే రసీదు తీసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్‌: వస్తువులు కొన్నవెంటనే తప్పనిరిగా రసీదు తీసుకోవాలని వినియోగదారుల సమాచార కేంద్రం చైర్మన్‌ మాయావార్‌ రాజేశ్వర్‌ సూచించారు. వాణి ఒకేషనల్‌ జూనియర్‌ కాలేజీలో విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌ మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. ఆహార కల్తీ, తూనికలు, కొలతల్లో మోసాలు జరిగినా, ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు వస్తువులు విక్రయించినా జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రానికి తెలియజేయాలని సూచించారు. 2019లో వచ్చిన నూతన వినియోగదారుల చట్టం గురించి తెలుసుకోవాలని సూచించారు. వినియోగదారుడు నష్టపోతే జిల్లా వినియోగదారుల కమిషన్‌లో రూ.50 లక్షల వరకు నష్టపరిహారం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో విద్యార్థినీవిద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జీజీ విద్యార్థికి నాలుగు గోల్డ్‌ మెడల్స్‌



నిజామాబాద్‌నాగారం: మంచిర్యాలలో ఈనెల 1వ తేదీన నిర్వహించిన సీనియర్‌ ఇంటర్‌ డిస్ట్రిక్ట్‌ టోర్నమెంట్‌ ఉషూలో తమ కళాశాల విద్యార్థి మహమ్మద్‌ ఆవిష్‌ నాలుగు గోల్డ్‌ మెడల్స్‌ సాధించడం అభినందనీయమని గిరిరాజ్‌ కళాశాల ప్రిన్సిపల్‌ రామ్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం తన చాంబర్‌లో విద్యార్థి ఆవిష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు రాయ్‌పూర్‌ డెహ్రాడూన్‌లో నిర్వహించే జాతీయ స్థాయి టోర్నీలో సత్తాచాటి కళాశాలకు మంచి పేరుతీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపల్‌ రంగరత్నం, పీడీ బాలమణి అధ్యాపకులు పాల్గొన్నారు.

పండుగలు సంస్కృతికి ప్రతీకలు

- పాశ్చాత్య సంస్కృతికి భిన్నంగా నవరాత్రి ఉత్సవాల్లో జడ కొప్పుకోలాటం
- ప్రాచీన కళతో అలరించిన బాడ్సికి చెందిన కళాకారులు



జడ కొప్పు వేస్తున్న కళాకారులు

పెర్కిట్‌(ఆర్మూర్‌): వ్యవసాయ రంగంలో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న అంకాపూర్‌ గ్రామం.. గణేశ్‌ నవరాత్రోత్సవాల నిర్వహణలోనూ ఆదర్శంగా నిలుస్తోంది. గ్రామంలో గణేశ్‌ నవరాత్రులను తెలంగాణ సంస్కృతి ఉట్టిపడే విధంగా నిర్వహిస్తున్నారు. జానపద కళలను మరిచిపోయిన పాత తరానికి, ఇదే అసలైన మన సంస్కృతి అని యువతరానికి తెలియజెప్పేందుకు నవరాత్రుల్లో జడ కొప్పుల కోలాటం ఏర్పాటు చేసి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. జడకొప్పుల కోలాటానికి పుట్టినిల్లు అయిన నిజామాబాద్‌ జిల్లా మోపాల్‌ మండలం బాడ్సి గ్రామానికి చెందిన ప్రధాన గురువు మహిపాల్‌రెడ్డి, సహాయ గురువు దశరథ్‌ నేతృత్వంలో 32 మంది కళాకారులు అంకాపూర్‌లో ప్రాచీన కళతో అలరించారు. అంకాపూర్‌పై మమకారంతో మహిపాల్‌రెడ్డి ఏమీ ఆశించకుండా తన కళా బృందంతో జడ కొప్పుల కోలాటాన్ని ప్రదర్శించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతరించిపోతున్న కళను తిరిగి ప్రాచుర్యంలోకి తీసుకు రావాలన్న సంకల్పంతో ఏడు పదుల వయస్సులో సైతం అలుపెరగకుండా మహిపాల్‌రెడ్డి జానపద గీతాలు ఆలపిస్తూ ఆకట్టుకున్నారు. మహిపాల్‌ రెడ్డి ఆలపించిన 'పాలు అమ్మెటోళ్లం.. గోపాలున్ని నమ్ముకున్నోళ్లంతోపాటు గురుదేవ గురుదేవ ఉయ్యాలో.. గుర్తు తెలపవయ్యో ఉయ్యాలో' వంటి జానపద గీతాలు కోలాటంలో ఆకట్టుకున్నాయి. మహిపాల్‌రెడ్డి పాటలకు లయబద్ధంగా కళాకారులు జడకొప్పుల కోలాటం కనుల పండువగా సాగింది. గ్రామస్తులంతా కలిసి జడకొప్పుని ఆసక్తిగా వీక్షించారు.



జడ కొప్పు కోలాటాన్ని వీక్షిస్తున్న గ్రామస్తులు

పూర్వ వైభవం తీసుకురావాలి



మన కళలకు పూర్వ వైభవం తీసుకు రావాలనే ఉద్దేశంతో నవరాత్రుల్లో హిందూ సమితి ఆధ్వర్యంలో జడకొప్పుల కోలాటం ఏర్పాటు చేశాం. రానున్న రోజుల్లో మన సాంప్రదాయాలు, గౌరవాలను పాటిస్తూ పండగలను నిర్వహిస్తాం. బాడ్సి కళాకారులు ఎలాంటి డబ్బులు ఆశించకుండా సొంత ఖర్చులతో తమ కళను ప్రదర్శించడం ఆదర్శనీయం.

– నల్ల చిన్న బొర్రన్న, హిందూ సమితి, అంకాపూర్‌

ప్రాచీన కళలే సంస్కృతికి జీవం



ప్రాచీన కళలే మన సంస్కృతికి జీవం. 50 ఏళ్ల క్రితం బాడ్సికి వచ్చిన గురువు నుంచి జడ కొప్పుల కోలాటం నేర్చుకున్నా. నేను నేర్చుకున్న కళను గ్రామస్తులందరికీ నేర్పిస్తున్నా. బాడ్సిలో 160 మంది కళాకారులు ఉన్నారు. కళ అంతరించిపోకుండా కాపాడుతున్నాను. ఈ కళను అన్ని ప్రాంతాల్లో పరిచయం చేయడానికి ప్రయత్నం చేస్తున్నా.

– మహిపాల్‌రెడ్డి, గురువు, జడకొప్పుల కోలాటం, బాడ్సి

పాశ్చాత్య సంస్కృతిని విడనాడాలి



యువత పాశ్చాత్య సంస్కృతిని వీడాలి. డీజే వంటి శబ్ద కాలుష్యం సృష్టించే వాయిద్యాలతో కాకుండా ఆధ్యాత్మికత, తెలంగాణ సంస్కృతి ఉట్టి పడే విదంగా నవరాత్రులను నిర్వహించాలి.

– ఏనుగు భాస్కర్‌రెడ్డి, గ్రామస్తుడు, అంకాపూర్‌

ప్రాచీన కళలను కాపాడుకోవాలి



అంతరించి పోతున్న కళలను కాపాడుకోవాలి. ప్రాచీన జానపద కళలపై యువతరం ఆసక్తి పెంచుకోవాలి. తెలంగాణ సంస్కృతికి ప్రాణమైన జానపద కళలు పండుగల్లో ప్రతిబింబించాలి.

– దశరథ్‌, సహాయ గురువు, బాడ్సి

హ్యాండ్‌ బాల్‌ ఎంపిక పోటీలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్‌లో గురువారం హ్యాండ్‌ బాల్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌ ఆదేశాల మేరకు ఉమ్మడి నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాల బాలుర సబ్‌ జూనియర్స్‌ హ్యాండ్‌ ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 120 మంది బాలురు హాజరయ్యారు. హ్యాండ్‌బాల్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగామోహన్‌ చక్రు, పింజ సురేందర్‌ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. హన్మకొండ జేఎన్‌ స్టేడియంలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే 38వ రాష్ట్ర స్థాయి సబ్‌ జూనియర్స్‌ బాలుర హ్యాండ్‌ పోటీల్లో జిల్లా జట్టు పాల్గొంటుందని నిర్వాహకులు తెలిపారు. పేటా సంఘం విద్యాసాగర్‌రెడ్డి, హ్యాండ్‌ బాల్‌ అసోసియేషన్‌ కోశాధికారి గటాడి రాజేశ్‌, హాకీ సంఘం జిల్లా అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, పీఈటీలు కొండ్ర అంజు, అజ్మత్‌, సురేశ్‌, సంజీవ్‌, నవీన్‌, రాహుల్‌, గోవింద్‌ పాల్గొన్నారు.

14న క్రికెట్‌ క్రీడాకారుల ఎంపిక

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన స్థానిక గవర్నమెంట్‌ గిరిరాజ్‌ కళాశాలలో ఉదయం 10 గంటలకు అండర్‌ – 19 క్రికెట్‌ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు నిజామాబాద్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ కార్యదర్శి వెంకట్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్స్‌కు హాజరయ్యే క్రీడాకారులు 16 నుంచి 19 సంవత్సరాల లోపు వారై ఉండాలని పేర్కొన్నారు. క్రీడాకారులు తమ వెంట ఆధార్‌ కార్డు, పదో తరగతి మెమో లేదా వయసు ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులను ఈనెల 20న వరంగల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు కోచ్‌ సురేశ్‌ తెలిపారు. 14 నుంచి 19వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని, ఇతర వివరాలకు 98492 02586 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

యూనియన్‌ ఎన్నికల్లో ఎంఈవో ప్రచారం



నిజామాబాద్‌అర్బన్‌: విద్యాశాఖ పరిధిలోని ప్రధాన సంఘమైన పీఆర్టీయూ జిల్లా నూతన కార్యవర్గానికి ఎన్నికల ప్రచారం ప్రస్తుతం కొనసాగుతోంది. ఇటీవల వివిధ మండలాలకు నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేసిన పీఆర్టీయూ.. జిల్లా కార్యవర్గం ఎన్నికకు సిద్ధమైంది. ప్రస్తుతం బోధన్‌ నుంచి ప్రధాన కార్యదర్శిగా శంకర్‌ పోటీ చేస్తుండగా, ఆయనను గెలిపించాలని రుద్రూరు మండల విద్యాశాఖ అధికారి నాగనాథ్‌ వాట్సాప్‌ గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నారు. గురువారం వర్ని, రుద్రూర్‌, బోధన్‌ మండలాలకు సంబంధించిన టీచర్ల గ్రూపుల్లో పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శిగా శంకర్‌ను గెలిపించాలని సంబంధిత టీచర్లను కోరారు. ఇలా మండల విద్యాశాఖ అధికారి ప్రధాన సంఘం ఎన్నికలకు ప్రచారం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా.. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్‌హెచ్‌వోపై విచారణకు డీసీ ఆదేశం

ఖలీల్‌వాడి: నగర ఎక్సైజ్‌ ఎస్‌హెచ్‌వో దిలీప్‌పై విచారణ చేపట్టాలని ఎక్సైజ్‌ డిప్యూటీ కమిషనర్‌ సోమిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌హెచ్‌వోపై ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ మల్లారెడ్డి విచారణ చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిపోకు సంబంధించిన వ్యవహారంలో విచారణను ఆలస్యం చేయడంతోపాటు పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో విచారణ చేపట్టాలని ఈనెల 9న ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలస్యంగా తెలిసింది.

కులాస్‌పూర్‌ అడవుల్లో చిరుతల సంచారం!

- భయాందోళనలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు
- చిరుతల సంచారం ఆనవాళ్లు లేవు: ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌వో రవిమోహన్‌ భట్‌



కులాస్‌పూర్‌ అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్‌ సెక్షన్‌, బీట్‌ ఆఫీసర్లు

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): మండలంలోని కులాస్‌పూర్‌ అటవీప్రాంతంలో చిరుతల సంచారం కలకలం రేపుతోంది. చిరుతలు సంచరిస్తున్నాయని ప్రచారం జోరందుకోవడం, సోషల్‌ మీడియాలో వైరల్‌ కావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మంచిప్ప, ముదక్‌పల్లి, బాడ్సి, చిన్నాపూర్‌, కులాస్‌పూర్‌ శివార్లలో రిజర్వ్‌ ఫారెస్ట్‌ ఉంది. ఈక్రమంలో బుధవారం గేదెలను మేపుతుండగా కులాస్‌పూర్‌ శివారులో చిరుతలు కనిపించాయని గ్రామానికి చెందిన పశువుల కాపరి విజయ్‌ తెలిపాడు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు గురువారం ఫారెస్ట్‌ సెక్షన్‌ ఆఫీసర్‌ సాయికుమార్‌, బీట్‌ ఆఫీసర్లు ప్రవీణ్‌, సాయికృష్ణ అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. పశువుల కాపరి విజయ్‌తోపాటు పలువురు గ్రామస్తులను వెంటపెట్టుకుని చిరుతలు సంచరించిన ప్రాంతాల్లో ఆనవాళ్లు సేకరించారు. చిరుతలు తిరిగినట్లు ఎలాంటి ఆనవాళ్లు లభించలేదని ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌వో రవిమోహన్‌ భట్‌ తెలిపారు. అయినప్పటికీ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు వంటి మూగ జీవాలను ఇంటి పరిసరాల్లోనే ఉంచాలని సూచించారు. ప్రజలు కూడా రాత్రివేళల్లో బయటికి రావొద్దన్నారు. కాగా కులాస్‌పూర్‌ అటవీ ప్రాంతంలో గత 15 రోజులుగా చిరుతలు సంచరిస్తున్నాయని, ఇప్పటివరకు 10 వరకు మేకలు, గొర్రెలపై దాడి చేయడంతో మృత్యువాత పడ్డాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.



చిరుత అడుగుగా భావిస్తున్న పాదముద్ర

నకిలీ నోట్ల కలకలం

- స్టార్‌ హోటల్‌లో వ్యభిచారం చేస్తూ పట్టుబడిన విటులు, యువతులు
- సీడ్స్‌ కంపెనీ మీటింగ్‌ పేరుతో పార్టీ
- వివరాలు వెల్లడించని పోలీసుశాఖ

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): స్టార్‌ హోటల్‌లో వ్యభిచారం నడుస్తుందనే విశ్వసనీయ సమాచారంతో బుధవారం రాత్రి దాడిచేసిన నిజామాబాద్‌ సీసీఎస్‌ పోలీసులు, డిచ్‌పల్లి పోలీసులకు నిందితుల వద్ద నకిలీ కరెన్సీ పట్టుబడటం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్‌ శివారులోని స్టార్‌ హోటల్‌పై జరిపిన దాడిలో పోలీసులు 8 మంది విటులతో పాటు ఐదుగురు యువతులు, హోటల్‌ నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వారి వద్ద 13 మొబైల్‌ ఫోన్లు, రూ. 38,760 నగదుతో పాటు నకిలీ కరెన్సీ లభించింది. వీరి వద్ద ఫేక్‌ కరెన్సీ ఎందుకు ఉంది..? నకిలీ నోట్ల చలామణిలో ఎవరి పాత్ర ఉందనేది చర్చనీయాంశంగా మారింది. నకిలీ నోట్ల వివరాలను పోలీసులు అధికారులు పూర్తిగా వెల్లడించక పోవడం అనుమానాలకు తావిస్తోంది. హైటెక్‌ వ్యభిచారంలో పోలీసులకు పట్టుబడిన విటులలో నిజామాబాద్‌ జిల్లా ఆర్మూర్‌ వినాయక్‌ నగర్‌ కు చెందిన ఖాందేష్‌ అశోక్‌, నిజామాబాద్‌ ద్వారక నగర్‌ కు చెందిన నల్ల శ్రీనివాస్‌, మెండోరా కు చెందిన ముస్కు రాజా, సామ గంగాధర్‌ అలియాస్‌ గంగారెడ్డి, కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లికి చెందిన కుంట లింగన్న, అలాల లింగారెడ్డి, సింగిరెడ్డి భరత్‌ తో పాటు హైదరాబాద్‌ ఫిలింనగర్‌ కు చెందిన డ్రైవర్‌ ఉంతూరు మధుసూదన్‌ సుదన్‌ ఉన్నారు. యువతులను మధుసూదన్‌ తీసుకువచ్చి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పట్టుబడిన మహిళల్లో ఇద్దరు ఆంధ్రాకు చెందిన వారు ముగ్గురు హైదారాబాద్‌కు చెందిన యువతులు ఉన్నారు. మధుసూదన్‌ వాట్సాప్‌ గ్రూపులలో యువతుల ఫొటోలను పంపి స్టార్‌ హోటల్‌కు విటులను రప్పించినట్లు తెలుస్తోంది.

రేవ్‌ పార్టీ స్థాయిలో..

విశ్వసనీయ సమాచారం మేరకు.. పోలీసులకు పట్టుబడిన వారు సీడ్స్‌ కంపెనీ తరఫున మీటింగ్‌ ఏర్పాటు చేసుకుంటామని స్టార్‌ హోటల్‌లో దిగారు. వారి వెంట యువతులు ఉన్నారు. మీటింగ్‌ హాల్‌ అద్దెకు తీసుకుని మీటింగ్‌ పేరుతో మద్యం సేవించారు. అనంతరం రాత్రికి రేవ్‌ పార్టీ స్థాయిలో పార్టీ జరుపుకున్నట్లు తెలుస్తోంది. డ్యాన్సు చేస్తున్న యువతులపై చల్లడానికి తమ వెంట తెచ్చుకున్న నకిలీ కరెన్సీని ఉపయోగించినట్లు సమాచారం. గుర్తు తెలియని వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించడంతో సీసీఎస్‌ పోలీసులు, డిచ్‌పల్లి పోలీసులు స్టార్‌ హోటల్‌పై దాడి చేసి నిందితులను అరెస్ట్‌ చేశారు. ఈ విషయమై డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌ను సంప్రదించగా పట్టుబడినవి నకిలీ నోట్లు కావని, పిల్లలు కిరాణా షాపుల్లో కొనుగోలు చేసే కరెన్సీ అని తెలిపారు.

రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేస్తాం

ఖలీల్‌వాడి: న్యాయవాది వసంత్‌రావుపై భౌతిక దాడి చేసిన జగన్‌మోహన్‌ నవాతేపై రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేస్తామని బార్‌ అధ్యక్షుడు మల్లెపూల జగన్‌ మోహన్‌గౌడ్‌ అన్నారు. ఈ ఘటనపై ముగ్గురు సీనియర్‌ న్యాయవాదులతో ఒక కమిటీని నియమించామని, నివేదిక అందగానే జగన్‌మోహన్‌ నవాతేపై మరిన్ని కఠిన చర్యలుంటాయన్నారు. బార్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి వసంత్‌రావుపై భౌతిక దాడి నేపథ్యంలో గురువారం బార్‌ అత్యవసర సమావేశం నిర్వహించారు. సీనియర్‌ న్యాయవాదులు ఎర్రం గణపతి, శ్రీహరి ఆచార్య, పిట్లం శ్రీనివాస్‌, పరుచూరి శ్రీధర్‌, కృపాకర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదిపై దాడి.. న్యాయవాదులందరిపై దాడిగా వారు అభివర్ణించారు. జగన్‌ మోహన్‌నవతే న్యాయవాదిగా ప్రాక్టీస్‌ చేయకుండా తెలంగాణ రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ ఉత్తర్వులు ఉన్నాయన్నారు. అలాంటి వ్యక్తి కోర్టు పరిధిలో ఉండి చట్ట విరుద్ధంగా వ్యవహరించడం చాలా పెద్ద తప్పిదంగా వారు పేర్కొన్నారు. నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ సభ్యత్వం నుంచి సస్పెన్షన్‌ చేస్తూ తదుపరి క్రమ శిక్షణ చర్యల కోసం ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు. గత ఫిబ్రవరి నుంచి న్యాయవాదిగా ప్రాక్టీస్‌ చేయకుండా జగన్‌మోహన్‌ నవాతేపై ఉత్తర్వులు ఉన్నాయని, కక్షిదారులు గమనించాలని కోరారు. రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ సభ్యుడు మంథని రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అత్యవసర సమావేశంలో మాట్లాడుతున్న బార్‌ అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్‌

క్రైం కార్నర్‌

పరిస్థితి విషమించి మృతి



నారాయణగౌడ్‌ (ఫైల్‌)

జక్రాన్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని పడకల్‌ గ్రామానికి చెందిన అబ్బగోని నారాయణగౌడ్‌ (65) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి గ్రామ శివారులో ఈ నెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో నారాయణగౌడ్‌కు తీవ్రగాయాలు కాగా, నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ముత్యంపేటకు చెందిన యువకుడు..



రాము(ఫైల్‌)

దోమకొండ: మండలంలోని ముత్యంపేటకు చెందిన జొన్నల రాము(23) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం మాచారెడ్డి మండలం భవానీపేట – ఉగ్రవాయి స్టేజీ వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో గాయాలపాలైన రాముకు తీవ్ర గాయాలయ్యాయి. రామును హైదరాబాద్‌కు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు.

కుటుంబ సభ్యులకు వృద్ధుడి అప్పగింత



వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌లో తప్పిపోయిన వెస్ట్‌ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన వృద్ధుడు కృష్ణమూర్తిని రైల్వే ఎస్సై సాయిరెడ్డి గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కృష్ణమూర్తి ఈనెల 9న నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌ తప్పిపోవడంతో కుటుంబ సభ్యులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పలుచోట్ల గాలించగా, గురువారం నగరంలోని పాలిటెక్నిక్‌ కళాశాల వద్ద ఆచూకీ లభించింది. వెంటనే వృద్ధుడి కుమారుడికి సమాచారం అందించి వారికి అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బోధన్‌రూరల్‌: మండలంలోని బండార్‌పల్లి శివారులో ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొని రాంపూర్‌ గ్రామానికి చెందిన మారుతి, నాగయ్య అనే ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు, గ్రామస్తులు చికిత్స నిమిత్తం బోధన్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నాగయ్య బోధన్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, తీవ్రగాయాలపాలైన మారుతిని నిజామాబాద్‌ ఆస్పత్రికి తరలించారు.

కుక్కల దాడిలో జీపీ డ్రైవర్‌కు..

ఎడపల్లి (బోధన్‌): మండలంలోని బాపునగర్‌ గ్రామపంచాయతీ డ్రైవర్‌ సుందర్‌ కుక్కల దాడిలో గాయపడ్డారు. మండలంలోని ఏఆర్పీ క్యాంప్‌నకు చెందిన సుందర్‌ గ్రామపంచాయతీలో డ్రైవర్‌ గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం కుక్కలు దాడి చేయడంతో అతనికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆరుగురిపై కేసు నమోదు

వర్ని: కాంగ్రెస్‌ పార్టీ నాయకుడు కుమ్మరి భీమాశంకర్‌పై దాడి చేసిన ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణకుమార్‌ తెలిపారు. బుధవారం రాత్రి కాంగ్రెస్‌ పార్టీలోని మరో వర్గానికి చెందిన నాయకులు శంకర్‌పై దాడి చేసి గాయపర్చగా, బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

సిరికొండలో ముగ్గురిపై..

సిరికొండ: మండలంలోని వర్జన్‌ తండాకు చెందిన శ్రీకాంత్‌పై బుధవారం రాత్రి కర్రలతో దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్‌ రామ్‌ గురువారం తెలిపారు. శ్రీకాంత్‌పై నితిన్‌, శ్రీను, భాస్కర్‌ దాడి చేశారని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి అదృశ్యం



రాధాకిషన్‌

నవీపేట : మండల కేంద్రానికి చెందిన కారంగ్‌పురి రాధాకిషన్‌ (23) అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్‌ గురువారం తెలిపారు. ఈనెల 4న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన రాధాకిషన్‌ తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారని పేర్కొన్నారు. గత ఆరు సంవత్సరాలుగా రాధాకిషన్‌ మతిస్థిమితం సరిగా లేదన్నారు. రాధాకిషన్‌ తండ్రి గంగాధర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాపర్‌ చోరీ.. కేసు నమోదు

బోధన్‌రూరల్‌ : సాలూర మండలం సాలంపాడ్‌ క్యాంప్‌ శివారులో, బోధన్‌ మండలం నాగన్‌పల్లి గ్రామ శివారులోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి దుండగులు గురువారం కాపర్‌, కాయిల్స్‌, ఆయిల్‌ చోరీ చేసినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌ తెలిపారు. ట్రాన్స్‌కో ఏఈ కల్యాణ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మనస్తాపంతో ఆత్మహత్య

- అనారోగ్యం, ఎవరూ మాట్లాడకపోవడమే కారణం..
- హత్య కేసులో జైలుశిక్ష అనుభవించిన మృతుడు



గంగారాం(ఫైల్‌)

వర్ని: హత్య కేసులో పన్నెండేళ్లపాటు జైలు శిక్ష అనుభవించి ఇటీవలే బయటికి వచ్చిన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సాయన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రుద్రూర్‌ మండల కేంద్రానికి చెందిన పన్నీరు పల్లికొండ గంగారాం.. 12 సంవత్సరాల క్రితం హత్య కేసులో జైలుకు వెళ్లి రెండు నెలల క్రితం బయటకు వచ్చాడు. జైల్లో ఉన్న సమయంలో గంగారాంకు కిడ్నీ ఆపరేషన్‌ అయ్యింది. బయటికి వచ్చిన తరువాత అనారోగ్య సమస్యలకు తోడు ఎవరూ మాట్లాడకపోవడంతో మనస్తాపం చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి మేనమామ లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంట్లో గొడవపడి..

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని పాతంగల్‌ శివారు అడవిలోని బుగ్గరామేశ్వరాలయం సమీపంలో సాకలి వెంకటి(26) అనే వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సంగారెడ్డి జిల్లా ఖాజాపూర్‌ మండలం సిర్గాపూర్‌ గ్రామానికి చెందిన సాకలి వెంకటి గాంధారిలో డ్రైవర్‌గా పనిసేవాడు. వెంకటికి అదే గ్రామానికి చెందిన రాణితో ఏడాదిన్నర క్రితం పెళ్లి జరిగింది. మద్యానికి బానిసైన వెంకటి రోజూ ఇంట్లో గొడవ పడేవాడు. కొన్ని రోజుల క్రితం సిర్గాపూర్‌కు వెళ్లిన అతడు.. మళ్లీ గొడవ పడి మూడు రోజుల క్రితం గాంధారి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయల్దేరాడు. అనుమానంతో కుటుంబ సభ్యులు వెతకగా గాంధారి – బాన్సువాడ ప్రధాన రహదారి పక్కన బుగ్గగండి ప్రాంతంలోని అడవిలో వెంకటి బైక్‌ను గుర్తించారు. అడవిలో వెతకగా బుగ్గరామేశ్వరాలయం సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకొని వెంకటి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతుడి తండ్రి హనుమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డీజే నిర్వాహకుల బైండోవర్‌



తహసీల్దార్‌ ఎదుట డీజే నిర్వాహకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన డీజే నిర్వాహకులను తహసీల్దార్‌ నరేందర్‌ ఎదుట ఎస్సై అరుణ్‌కుమార్‌ గురువారం బైండోవర్‌ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద డీజేలు ఏర్పాటు చేసేందుకు అనుమతి లేదని, నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

దోమకొండ తహసీల్దార్‌ ఎదుట..

దోమకొండ: పీడీఎస్‌ బియ్యాన్ని అక్రమరవాణా చేస్తూ గతంలో కేసులు నమోదైన నలుగురిని గురువారం తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మాచారెడ్డి మండలం భవానీపేట్‌ తండాకు చెందిన అజ్మీరా వెంక్యా, అజ్మీరా అరవింద్‌, భూక్యా నరేందర్‌తోపాటు బియ్యం కొనుగోలు చేస్తున్న దోమకొండకు చెందిన రైస్‌మిల్‌ యజమానిని సైతం బైండోవర్‌ చేశామన్నారు.